# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 310 | పేజీలు: 4 | వెల: 4/- | సోమవారం • 20, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## యూపీఎస్సీ పరీక్షలు రాసే వారికి రూ.3 వేలు

**మణిపూర్ ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం**



మణిపూర్,(నమస్తే ఉదయం): అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు అరుదైన ఆదేశాలు జారీ చేసింది. మణిపూర్ వెలుపల యూపీ ఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు హాజరయ్యే వారికి రోజుకు మూడు వేలు ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఉత్తర్వులు కూడా జారీ చేసింది. జూన్ 16న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష జరగనుంది. అయితే ఈ నేపథ్యంలోనే మణిపూర్ వెలుపల పరీక్షా కేంద్రాలను మార్చాలని, రవాణా సౌకర్యం కల్పించాలంటూ 140 మంది అభ్యర్థులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. మణిపూర్‌లోని కొండ ప్రాంతాల జిల్లాల అభ్యర్థులు కోరిన ఇంఫాల్ పరీక్షా కేంద్రాన్ని మార్చడానికి అనుమతి ఇస్తామని మార్చి 29 ఢిల్లీ హైకోర్టు పేర్కొంది.



## షరతులతో క్యాబినెట్ భేటీకి

# సీఈసీ అనుమతి

**రాష్ట్ర మంత్రివర్గ భేటీకి షరతులతో అనుమతిచ్చిన ఈసీ**

**జూన్ 4లోపు చేయాల్సినఅత్యవసర అంశాలపైనే చర్చించాలి**

**రుణ మాఫీ, ఉమ్మడి రాజధానిపై మాట్లాడొద్దు**

**ఎన్నికల్లో భాగమైన అధికారులు పాల్గొనొద్దు**

**షరతులు విధించిన కేంద్ర ఎన్నికల సంఘం**

**నేడు సచివాలయంలో కేబినెట్ సమావేశం**

**ధాన్యం కొనుగోళ్లు, అకాల వర్షాలు, వానాకాలం పంటల ప్రణాళికపై భేటీలో చర్చ!**

హైదరాబాద్, మే 19 (నమస్తే ఉదయం): ఒక రోజంతా కొనసాగిన ఉత్కంఠకు తెరదించుతూ.. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అనుమతిచ్చింది. అయితే, కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో జూన్ 4లోపు చేయాల్సిన అత్యవసరమైన అంశాలనే చర్చించాలని షరతు విధించింది. ముఖ్యంగా రైతు రుణ మాఫీ, హైదరాబాద్ ఉమ్మడి రాజధాని వంటి అంశాలను భేటీలో చేపట్టకూడదని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికారులు సమావేశంలో పాల్గొనకూడదని స్పష్టం చేసింది. ఆదివారం ఈసీ నుంచి ఈ మేరకు సమాచారం రావడంతో.. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు క్యాబినెట్ భేటీ ఉంటుందని సీఎం శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంపై మంత్రులందరికీ సమాచారం చేరవేశారు. మిగతా.. 2లో

## కల్లాల వద్ద రైతుల కష్టాలు

# సర్కార్‌కు పట్టవా?

**తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లను ఎందుకు కొనడం లేదు?**

**అన్ని రకాల వడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వాల్సిందే**

**పంట నష్టపరిహారం ఎందుకివ్వడం లేదు?**

**ఈరోజు కేబినెట్ లో రైతులను ఆదుకునేలా నిర్ణయాలు తీసుకోండి**

**రైతుభరోసా, రుణమాఫీతో రైతన్నను ఆదుకోండి**

**బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ డిమాండ్**



హైదరాబాద్, (నమస్తే ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల రాష్ట్ర రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విఫలమైన ప్రభుత్వం... పండించిన వడ్లను సైతం సకాలంలో కొనుగోలు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తుండటంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిద్రాహారాలు మాని పడిగాపులు కాస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదారు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు సమాచారమిచ్చినప్పటికీ ప్రభుత్వం మాత్రం కల్లాల వద్ద వడ్ల కొనుగోలును వేగవంతం చేయకపోవడంతో పాటు కొనుగోలు కేంద్రాలవద్ద వడ్లు తడవకుండా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గం. దీంతో ప్రతిరోజు వానకు పదే పదే వడ్లు తడిసిపోవడం, తిరిగి వాటిని అరబెట్టేందుకు రైతులు తిండితిప్పలు మాని అష్ట కష్టాలు పడాల్సిన రావడం అత్యంత బాధాకరం. కొన్ని చోట్లు అన్ని ఇబ్బందులను అధిగమిస్తూ అన్నదాతలు వడ్లను ఆరబెట్టినప్పటికీ సకాలంలో వాటిని కొని, వారికి విముక్తి కలిగించే నాథుడే కరువయ్యారు.

తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఆదేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆదేశాలకు అనుగుణంగా జరుగుతున్న దాఖలాలే లేకపోవడం విచారకరం.

తాలు, తరుగు, తేమ పేరుతో క్వింటాలుకు 5 నుండి 10 కిలోలు కోత పెడుతూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. ఇచ్చిన హామి ప్రకారం కనీస మద్దతు ధర కూడా ఇవ్వకుండా క్వింటాలుకు రూ.200 నుండి రూ.500ల వరకు రైతులు నష్టపోతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే, సీఎం ఆదేశాలు ప్రకటనలకే పరిమితమయ్యాయని తెలిసిపోయింది..

అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా... కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం పేపర్‌పై రాసిచ్చిన హామీలను పట్టించుకున్న పాపాన పోలేదు. కాంగ్రెస్ గెలిచాక, కల్లాలకు రెండో పంటవచ్చినా... క్వింటాలుకు రూ.500ల బోనస్ హామీకి దిక్కు లేదు. బోనస్ ఇవ్వకపోగా సన్నవడ్లకే రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఇటీవల వార్తలు రావడం, దొడ్డు రకం వడ్లనే పండించిన అత్యధిక శాతం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. దీనిపై రైతాంగానికి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో వడ్ల కొనుగోలు సగానికిపైగా పూర్తయినట్లు మా దృష్టికి వచ్చింది. కొనుగోలు చేసిన వడ్లకు సైతం సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్నారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న సమస్యల్ని దృష్టిలో పెట్టుకుని వడ్లు కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు మిగతా.. 2లో


# అన్నారం, సుందిళ్లపై ఫోకస్

**బ్యారేజీల నుంచి ఈ సీజన్‌లో పంపింగ్‌కు నిర్ణయం!**

**త్వరలో పంప్‌హౌస్‌ల పరిశీలనకు ముఖ్యమంత్రి బ్యారేజీల మరమ్మతు పనులు వేగవంతం**

**ఈ బ్యారేజీల నుంచి ఈ సీజన్‌లో నీరు పంపింగ్ చేసేందుకు నిర్ణయం!**

**త్వరలో పంప్‌హౌసల పరిశీలనకు సీఎం మరమ్మతు పనులు వేగవంతం**



హైదరాబాద్, మే 19(నమస్తే ఉదయం): కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో కాపాడుకొని, ఈ ఏడాది వీటిలో నీటిని నిల్వ చేసి, పంపింగ్ చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అన్నారం బ్యారేజీని పుణేలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస)తో, సుందిళ్లను జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ)తో పరీక్షలు చేయించడంతో పా టు ఆ బ్యారేజీలు కట్టిన నిర్మాణ సంస్థలతో మరమ్మతులు చేయించనున్నారు. బ్యారేజీ ఎగువ భాగం (అప్‌స్ట్రీమ్)తో పాటు దిగువ భాగం (డౌన్‌స్ట్రీమ్)లో ఉన్న సిమెంట్ కాంక్రీట్ (సీసీ) బ్లాకులు, అప్రాన్లతో పాటు రాఫ్ట్ (పునాది) కింది భాగంలో ఏర్పడిన రంధ్రాలను సిమెంట్, కాంక్రీట్ మిశ్రమంతో నింపనున్నా రు. ఈ ప్రక్రియ చేపడితే మరమ్మతులు తేలిక అవుతాయి. కాళేశ్వరంలో 3 బ్యారేజీలు ఉండగా అందులో సుందిళ్ల ఒక్కటే తక్కువ సమస్యలను కలిగి ఉంది. మరో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ గత ఏడాది అక్టోబరు మిగతా.. 2లో

# వేలాది కేజ్రీవాల్‌లు పుట్టుకొస్తారు!

**అరెస్టులతో ఆప్‌ను నాశనం చేయలేరు**

**ప్రధాని మోదీకి కేజ్రీవాల్ హెచ్చరిక**



న్యూఢిల్లీ, మే 19,(నమస్తే ఉదయం): ఒక్క కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే భరతమాత వేలాది మంది కేజ్రీవాల్‌లకు జన్మనిస్తుందని ప్రధాని మోదీని ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ హెచ్చరించారు. అరెస్టుల ద్వారా ఆప్‌ను నాశనం చేయలేరని, ఆప్ ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది ఒక ఆలోచనాధార అని చెప్పారు. ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి కేసులో తన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో బీజేపీ ప్రధాన కార్యాలయం ముట్టడికి కేజ్రీవాల్ శనివారం పిలుపునిచ్చారు.

పార్టీ కీలక నేతలను అరెస్టు చేసి జైలుకు పంపించటం ద్వారా ఆప్‌ను నాశనం చేయాలని మోదీ కుట్ర పన్నారని, అందుకే బీజేపీ హెడ్ ఆఫీసుకు అందరమూ వస్తామని, తమలో ఎవరినైనా అరెస్టు చేసుకోవచ్చంటూ మోదీకి సవాల్ విసిరారు. ఈ మేరకు బీజేపీ మిగతా.. 2లో

# నేడు ఐదోదశ పోలింగ్



న్యూఢిల్లీ,(నమస్తే ఉదయం): 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మొత్తం 543 నియోజకవర్గాల్లో 379 నియోజకవర్గాలకు నాలుగు దశల్లో పోలింగ్ పూర్తయిం ది. ఐదోదశ పోలింగ్ సోమవారం 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 నియోజక వర్గాల్లో జరగనుంది. మొత్తం ఓటర్లు 8.95 కోట్ల మం దిలో 4.26 కోట్ల మంది మహిళలు, 5109 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. మిగతా.. 2లో

## హెలికాప్టర్ ప్రమాదం..

# ఇరాన్ అధ్యక్షుడు రైసీ గల్లంతు

**తూర్పు అజర్‌బైజాన్‌లో కూలిన చాపర్!**

**ఆనకట్ట ప్రారంభానికి వెళ్లివస్తుండగా ఘటన**

**జోల్ఫా అడవుల్లో హెలికాప్టర్ మిస్సింగ్**

**పర్వతాలు.. భారీ వర్షాలు.. పొగమంచుతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు**

**రైసీ వెంట విదేశాంగ మంత్రి**

**అమెరికా అధ్యక్షుడు బైడెన్ అత్యవసర భేటీ**

**క్షేమంగా తిరిగి రావాలన్న ప్రధాని మోదీ**




టెహ్రాన్, మే 19, (నమస్తే ఉదయం): ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గల్లంతైంది. పొరుగుదేశం అజర్‌బైజాన్, ఇరాన్‌లోని తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్ సరిహద్దుల్లో ఓ డ్యామ్ ప్రారంభోత్సవానికి ఆయన ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ ఆమిర్ అబ్దులాహి యన్, అధికారులు, అంగరక్షకులతో కలిసి హెలికాప్టర్‌లో బయలుదేరారు. కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణమ య్యారు. మరో రెండు హెలికాప్టర్లు కూడా ఆయన చాపర్ వెంట ఉన్నాయి. మధ్యాహ్నానికి తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్‌లోని పర్వత ప్రాంతాలు, డిజ్మార్ అటవీ ప్రాంతాన్ని దాటే క్రమంలో.. జోల్ఫా గ్రామం సమీపంలో రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు రాడార్‌తో సంబంధాలు తెగిపోయాయి. ఆ సమయంలో జోల్ఫాతోపాటు.. ఉజి, అర్దేషిరి, బారాజిన్ గ్రామాలతోపాటు.. డిజ్మార్ అటవీ ప్రాంతాల్లో భీకర వర్షం కురుస్తోంది. ఈదురు గాలులు, దట్టమైన పొగమంచుతో వాతావరణం ప్రతికూలంగా మారింది. మరో 2 హెలికాప్టర్లు గమ్యస్థానానికి చేరుకున్నా.. రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ జాడ లేకపోవడంతో.. ఆదివారం సాయంత్రం నుంచి ఇరాన్ వ్యాప్తంగా టెన్షన్ నెలకొంది. కాసేపటికి తూర్పు అజర్‌బైజాన్ గవర్నర్ మాలిక్ రహ్మతి “అధ్యక్షుడు రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కూలిపోయింది” అని ప్రకటించారు. అయితే.. ఇరాన్ అధికారిక మీడియా, అధికారులు మాత్రం.. “రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ జోల్ఫా ప్రాంతంలో హార్డ్ ల్యాండింగ్ అయ్యింది” అని తెలిపారు. అధ్యక్షుడు ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో విదేశాంగ మంత్రి, పైలట్, కోపైలట్, అధ్యక్షుడి భద్రతా బృందం అధిపతి, అంగరక్షకులు, అధికారులు ఉన్నట్లు వివరించారు.

### ప్రతికూల వాతావరణంలో గాలింపు

హెలికాప్టర్ హార్డ్ ల్యాండింగ్ సమాచారం అందగానే.. సైన్యం, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ), రెడ్ క్రెసెంట్‌తో పాటు.. మొత్తం 20 బృందాలు గాలింపు ప్రారంభించాయి. భారీ వర్షం, ఈదురు గాలుల కారణంగా గాలింపులో ఆటంకాలు ఏర్పడుతున్నాయని, కొండ ప్రాంతాల్లో మట్టిరోడ్లు చిత్తడిగా మారిపోయి, వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు పేర్కొన్నారు. “సమాచారం అందిన వెంటనే హెలికాప్టర్ల ద్వారా గాలింపునకు ప్రయత్నించాం. అయితే.. దట్టమైన పొగమంచుతో ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పదాతి దళాలు అతికష్టమ్మీద ముందుకు సాగుతున్నాయి” అని ఇరాన్ ఎమర్జెన్సీ సేవల అధికార ప్రతినిధి బాబక్ యెక్తాపరస్ట్ మీడియాకు తెలిపారు. కడపటి వార్తలందేసరికి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా.. రైసీ క్షేమంగా తిరిగి రావాలంటూ ఇరాన్ వ్యాప్తంగా ప్రజలంతా ప్రార్థనలు చేయాలంటూ అధికారులు ప్రసార మాధ్యమాల ద్వారా కోరుతున్నారు. ఇరాన్ మిత్ర దేశాలు కూడా రైసీ క్షేమ సమాచారం కోసం ప్రార్థనలు చేస్తున్నాయి. కాగా.. రైసీ హెలికాప్టర్ గల్లంతుపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు వైట్‌హౌస్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఎప్పటి కప్పుడు బైడెన్ ఇరాన్ అధ్యక్షుడి సమాచారాన్ని ఆరా తీస్తున్నట్లు వివరించాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇరాన్ అధ్యక్షుడు రైసీ క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు. అటు ఇరాన్ మద్దతున్న ఉగ్రవాద సంస్థలు ఇస్లామిక్ జిహాద్ పొలిటికల్ బ్యూరో నేత అలీ అబూ షాహిన్, హమాస్ సీనియర్ సభ్యుడు ఇజ్జత్ అల్-రెష్కతోపాటు.. హిజ్బుల్లా, హౌతీ నేతలు కూడా రైసీ క్షేమ సమాచారం కోసం ప్రార్థనలు చేస్తున్నట్లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

### కాలం చెల్లిన హెలికాప్టరే కారణమా?

ఇరాన్ వద్ద హెలికాప్టర్లన్నీ కాలం చెల్లినవని తెలుస్తోంది. 1979 నాటి ఇస్లామిక్ రివల్యూషన్ సమయంలో ఉన్న హెలికాప్టర్లే ఇప్పటికీ సైన్యంలో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఇరాన్ వాటి విడిభాగాలను కూడా దిగుమతి చేసు కోలేని పరిస్థితులున్నాయి. ఆదివారం రైసీ ప్రయాణించిన హెలికాప్టర్ కూడా కాలం చెల్లిందే కావడంతో ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోలేక ప్రమాదం జరిగి ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### సుప్రీంలీడర్‌కు నమ్మిన బంటు!

హెలికాప్టర్ ప్రమాదంలో గల్లంతైన రైసీ వయస్సు 63 సంవత్స రాలు. ఆయన అధ్యక్ష పదవిని చేపట్టక ముందు న్యాయశాఖకు నేతృత్వం వహించారు. 1988లో ఇరాక్-ఇరాన్ యుద్ధం సందర్భంగా చిక్కిన ఖైదీలకు సామూహికంగా మరణశిక్ష విధించి, అమలు చేశారు.

వీరిలో మైనర్లు కూడా ఉండడాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబడుతూ.. రైసీపై ఆంక్షలు విధించింది. 2015 నుంచి ఇరాన్‌లో అణ్వాయుధాలకు కావాల్సిన యురేనియం(వెపన్ గ్రేడ్) తయారీలో కీలక పాత్ర పోషించారు. 2017 ఎన్నికల్లో హసన్ రౌహానీకి వ్యతిరేకంగా బరిలో ఉన్నా.. ఓటమిపాలయ్యారు. 2021 ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించారు. అయితే.. 2021లో అత్యల్పంగా ఓటింగ్ జరిగి, 2.89 కోట్ల మంది పౌరులు మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఆ ఎన్నికలో రైసీ 62% ఓట్లను సాధించి, అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. యురేనియం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

హమాస్, హౌతీ, హిజ్బుల్లా, ఇస్లామిక్ జిహాద్ ఉగ్రసంస్థలకు అండదండలను అందజేశారనే ఆరోపణలున్నాయి. హమాసకు మద్దతుగా గత నెల ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడుల్లోనూ రైసీది కీలక పాత్ర అని స్పష్టమవుతోంది.

# కల్లాల వద్ద రైతుల కష్టాలు
# సర్కార్‌కు పట్టవా?

**మొదటిపేజీ తరువాయి..**

చెల్లించాలని కోరుతున్నాం. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలి. తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా వడ్లను కొనుగోలు చేసి కనీస మద్దతు ధర చెల్లించాలని, తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధరకు వడ్ల కోనుగోలు చేయాలని బీజేపీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

మరో ముఖ్యమైన అంశమేమిటంటే యాసంగిలో అకాల వర్షాలతో ప్రతిఏటా రైతులు నష్టపోతూనే ఉన్నా నష్ట పరిహారం అందించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమయ్యాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో యాసంగి సీజన్ లో కురిసిన అకాల వర్షాలతో వరి, మొక్కజొన్న, మామిడి పంట నష్టం జరిగినా నేటికీ పరిహారం అందనేలేదు. ఒక్కో రైతు సగటున ఎకరానికి రూ.20 వేల పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులపై అదనంగా మరో రూ.10 వేల భారం పడింది. వీరందరికీ కనీసం పంటల బీమా పథకాన్ని కూడా వర్తింపజేయడం లేదు. ప్రభుత్వ సాయం అందక, చేసిన అప్పులు తీరక జిల్లా రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉంది. వారి దుస్థితిని సహృదయంతో అర్థం చేసుకుని యుద్ద ప్రాతిపదికన నష్ట పరిహారం అందించాలని బీజేపీ పక్షాన కోరుతున్నాం.

అట్లాగే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఒక్కో ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి సుమారు 6 నెలలైనా రైతు భరోసా కింద రైతుకు సాయం అందలేదు. రూ.2 లక్షల రుణమాఫీ కాలేదు. పండించిన పంటకు డబ్బులు రాక, ప్రభుత్వం నుండి సాయం అందక, చేసిన అప్పులు తీరక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. దీనికితోడు వానాకాలం సీజన్ ప్రారంభం కాబోతోంది. వ్యవసాయానికి పెట్టుబడి లేక, బ్యాంకుల నుండి కొత్త అప్పులు పుట్టక రైతులు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ఈ తరుణంలో ఈరోజు (సోమవారం) జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడంతోపాటు వారికి ఉపశమనం కలిగేలా నిర్ణయాలు తీసుకుని యుద్ద ప్రాతిపదికన వాటిని అమలు చేయాలి. ముఖ్యంగా రాబోయే నాలుగైదు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో కల్లాల వద్ద ఉన్న వడ్లను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా అధికారులకు ఆదేశాలిచ్చి రైతులను ఆదుకోవాలని బీజేపీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

# అన్నారం, సుందిళ్లపై ఫోకస్

**మొదటిపేజీ తరువాయి..**

21న కుంగిపోయిన విషయం విదితమే. ఈ ఏడాది వరదలకు మరింత దెబ్బతినకుండా సర్కారు చర్యలకు ఉపక్రమించింది.

బ్యారేజీ గేట్లన్నీ ఎత్తడానికి చర్యలు తీసుకోనున్నారు. ఏడో బ్లాకుకు 12 గేట్లు ఉండగా అందులో ఒక గేటును ఇప్పటిదాకా లేపారు. ఇతర గేట్లను క్రమంగా ఎత్తనున్నారు. ఇక తీవ్రంగా దెబ్బతిన్న 2 పిల్లర్లకు చెందిన గేట్లను క్రేన్ల సహాయంతో లేపాల్సి ఉంటుంది. వరదల అనంతరం కాఫర్ డ్యామ్ నిర్మించి, కొత్త బ్లాకు లేదా దెబ్బతిన్న పిల్లర్ల స్థానంలో కొత్త పిల్లర్లు కట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ సీజన్‌లో మేడిగడ్డ బ్యారేజీ ఉపయోగంలోకి రాదని అభిప్రాయానికి సర్కారు వచ్చింది. దాం తో అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసుకొని, ఆ నీళ్లను ప్రాజెక్టులోని ఇతర రిజర్వాయర్లలోకి పంపింగ్ చేయనున్నారు. ఇందులో భాగంగా పంప్‌హౌసలను సీఎం రేవంత్ రెడ్డితో పాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి త్వరలో సందర్శించనున్నారు.

ప్రస్తుతం కన్నెపల్లి(మేడిగడ్డ), సిరిపురం (అన్నారం) పంప్‌హౌసలు సేఫ్ జోన్‌లో లేవు. పూర్తి రిజర్వాయర్ లెవల్ కన్నా కింద ఉన్నాయి. దాంతో వీటి ప్యానల్ బోర్డులను సురక్షిత ప్రాంతాల్లోకి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతా సవ్యంగా జరిగితే ఈసీజన్‌లో సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నీ రు ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలకు చేరనుంది. సీఎం పర్యటన నేపథ్యంలో మరమ్మతులు/పునరుద్ధరణ ప్ర క్రియను వేగవంతం చేశారు. పంప్‌హౌసల పరిశీలన అనంతరం సీఎం బ్యారేజీలపై కీలక ఆదేశాలు జారీ చేయనున్నారు.

# వేలాది కేజ్రీవాల్‌లు పుట్టుకొస్తారు!

**మొదటిపేజీ తరువాయి..**

ఆఫీసుకు ఆప్ నేతలు, కార్యకర్తలతో కలిసి కేజ్రీవాల్ ఆదివారం మధ్యాహ్నం తరలివెళ్లారు. వారిని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఆప్ వేగంగా ఎదగటాన్ని చూసి మోదీ తట్టుకోలేకపోతున్నారని, పార్టీని నాశనం చేయటానికి 'ఆపరేషన్ ఝాడూ (చీపురు)'ను ప్రారంభించారన్నారు.

దాంట్లో భాగంగానే తనతోపాటు పార్టీ ముఖ్య నేతలను జైలుకు పంపించారని, మరింత మంది ఆప్ నాయకులను అరెస్టు చేయనున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని తీవ్రమైన సవాళ్లు ఎదురుకానున్నాయని, వాటిని ఎదుర్కోవటానికి ఆప్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తారని, పార్టీ ఆఫీసును కూడా లాక్కొని రోడ్డు మీదికి ఈడుస్తారని.. వాటన్నింటికీ సిద్ధంగా ఉండాలని ఆప్ శ్రేణులకు సూచించారు. నిరసన కార్యక్రమంలో ఆప్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఢిల్లీ మంత్రులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, స్వాతిమలివాల్‌పై దాడికి సంబంధించి బిభవ్‌కుమార్‌ను ఢిల్లీలోని స్థానిక కోర్టు ఐదు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. ఈ కేసులో ఢిల్లీ పోలీసులు సీఎం నివాసంలోని సీసీటీవీ డిజిటల్ వీడియో రికార్డర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# నేడు ఐదోదశ పోలింగ్

**మొదటిపేజీ తరువాయి..**

94,732పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కాగా, 9.47 లక్షల పోలింగ్ అధికారులు నియామకమయ్యారు. మొత్తం 49 నియోజకవర్గాల్లో మహారాష్ట్రలో 13, ఉత్తరప్రదేశ్‌లో 14, పశ్చిమబెంగాల్‌లో 7, బీహార్‌లో 5,ఝూర?ండ్‌లో 3, ఒడిశాలో 5, జమ్ముకశ్మీర్‌లో 1, లడ్డాఖ్‌లో 1 వంతున ఉన్నాయి. పలువురు ప్రముఖులు ఈ దశలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, రాజీవ్ ప్రతాప్ రూడీ, పీయూష్ గోయల్, ఉజ్జల్ నికాం, కరణ్‌భూషణ్ సింగ్, ఎల్‌జెపి చీఫ్ చిరాగ్ పాశ్వాన్, జెకెఎన్‌సి చీఫ్ ఒమర్ అబ్దుల్లా, ఆర్‌జెడి నేత లాలూ ప్రసాద్ కుమార్తె రోహిణీ ఆచార్య, సాధ్వీ నిరంజన్ జ్యోతి, సంతన్ ఠాకూర్, శివసేన శ్రీకాంత్ షిండే, తదితరులు ఐదో దశలో ఉన్నారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లక్నో లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనపై సమాజ్ వాది పార్టీ అభ్యర్థి రవిదాస్‌మల్హోత్రా పోటీకి దిగారు. మంత్రిగా పనిచేసిన మల్హోత్రా ప్రస్తుతం లక్నో సెంట్రల్ అసెంబ్లీ స్థానం ఎమ్ఎల్ఏగా ఉన్నారు.

కీలకమైన స్థానాల్లో రాయ్‌బరేలీ నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పోటీగా బీజేపీ అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్ రంగంలో ఉన్నారు. అమేథీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కిషోరి లాల్ శర్మతో ఎస్‌పి రవిదాస్ మెహ్రోత్రా పోటీ పడుతున్నారు. ముంబై నార్త్ నుంచి బీజేపీ అభ్యర్థి పీయూష్ గోయల్ కు పోటీగా కాంగ్రెస్ అభ్యర్థి భూషణ్ పాటిల్ బరిలో ఉన్నారు. ముంబై నార్త్ సెంట్రల్ నుంచి బీజేపీ అభ్యర్థి ఉజ్వల్ నికాంతో కాంగ్రెస్ అభ్యర్థి వర్షాగైక్వాడ్ పోటీ పడుతున్నారు. కైసర్‌గంజ్ నుంచి బీజేపీ అభ్యర్థి కరణ్ భూషణ్ సింగ్, ఎస్‌పి అభ్యర్థి రామ్‌భగత్ మిశ్రా పోటీ పడుతున్నారు. హాజీపూర్ నుంచి ఎల్‌జెపి అభ్యర్థి చిరాగ్ పాశ్వాన్‌తో ఆర్‌జెడి అభ్యర్థి చంద్రరామ్ ఢీకొంటున్నారు. శరణ్ నుంచి ఆర్‌జెడి అభ్యర్థి లాలూ ప్రసాద్ కుమార్తె రోహిణీ ఆచార్య, బీజేపీ అభ్యర్థి బి రాజీవ్ ప్రతాప్ రూడీ పోటీ పడుతున్నారు.

బారాముల్లా నియోజకవర్గంలో ఎన్‌సి అభ్యర్థిగా ఒమర్ అబ్దుల్లాతో పీపుల్స్ కాన్ఫరెన్స్ అభ్యర్థి సజాద్‌లోనీ పిడిపి అభ్యర్థిగా మీర్ మొహమ్మద్ ఫయాజ్ పోటీ పడుతున్నారు. బారాముల్లా నియోజకవర్గంలో 17.37 లక్షల ఓటర్లలో 500 మంది కన్నా ఎక్కువ సంఖ్యలో శతాధిక వయోవృద్ధులు ఉండడం విశేషం.

ఏప్రిల్ 19న జరిగిన మొదటి దశ పోలింగ్ 21 రాష్ట్రాల్లో 102 నియోజకవర్గాల్లో జరిగింది. ఏప్రిల్ 26న 13 రాష్ట్రాలకు సంబంధించి 89 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. మే 7న మూడోదశలో 12 రాష్ట్రాల 94 స్థానాలకు పోలింగ్ జరిగింది. మే 13న నాలుగో దశలో 10 రాష్ట్రాల్లోని 96 స్థానాలకు పోలింగ్ జరిగింది.

ఒడిశా లోని 35 అసెంబ్లీ నియోజక వర్గాలకు పోలింగ్

ఒడిశాలోని 35 అసెంబ్లీ నియోజక వర్గాలకు కూడా సోమవారం పోలింగ్ జరగనుంది. ఒడిశా అభ్యర్థుల్లో బీజేడీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రంగంలో ఉన్నారు.

లక్నోలో అసెంబ్లీ ఉప ఎన్నిక లక్నో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి కూడా ఉప ఎన్నిక జరుగుతుంది.

# షరతులతో క్యాబినెట్ భేటీకి సీఈసీ అనుమతి

**మొదటిపేజీ తరువాయి..**

ఆయా శాఖల ఉన్నతాధికారులు కూడా దీనికి హాజరుకానున్నారు. కాగా, రాష్ట్రంలో ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో.. శనివారం మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. కోడ్ ఉన్నందున అనుమతి కావాలంటూ సీఈసీకి లేఖ రాసింది. వారినుంచి సమాధానం వస్తుందని శనివారం మధ్యాహ్నం నుంచి సీఎంతో పాటు మంత్రులు సచివాలయంలో ఎదురుచూశారు. అనుమతి రాకపోవడంతో రాత్రి 7 గంటల తర్వాత వెనుదిరిగారు. సోమవారం వరకు చూసి, స్పందన రాకుంటే మంత్రివర్గమే ఢిల్లీకి వెళ్లి ఎన్నికల సంఘాన్ని కలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.


అయితే, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాసరాజ్ సీఈసీ అధికారులతో చర్చించడం.. షరతులతో కూడిన అనుమతి రావడంతో సస్పెన్స్ వీడింది.

మరోవైపు ఈసీ షరతులను దృష్టిలో ఉంచుకుని.. ధాన్యం కొనుగోళ్లు, అకాల వర్షాలు, వానాకాలం పంటల ప్రణాళిక, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల వంటివాటిపై మంత్రివర్గం చర్చించనున్నట్లు సమాచారం. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణ మాఫీపై చాలా పట్టుదలగా ఉన్నారు. ఆగస్టు 15లోగా మాఫీ చేసి తీరుతామని పదేపదే చెప్పారు. ముందుగా అనుకున్న ప్రకారం.. క్యాబినెట్‌లో ఇదే కీలక అంశం అయ్యేది. కానీ, సీఈసీ షరతుతో చర్చకు అవకాశం లేదు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి, కోడ్ తొలగిపోయే నేపథ్యంలో జూన్ 4 తర్వాతనే చర్చించే వీలుంది. కాగా, రాజకీయంగా.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలపై మంత్రివర్గంలో సమీక్ష జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# రేపటితో ముగియనున్న కవిత జ్యుడీషియల్ కస్టడీ

**హైదరాబాద్,(నమస్తే ఉదయం):** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత జ్యుడీషియల్ కస్టడీ సోమవారం ముగియనున్నది. ఇడి, సిబిఐ రెండు కేసుల్లోనూ సోమవారం విచారణ జరగనున్నది. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం 2గంటలకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించే విషయంపై రౌస్ అవెన్యూ కోర్టు విచారించనున్నది. జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో కవితను కోర్టు ముందు ఇడి, సిబిఐ హాజరు పరిచే అవకాశం ఉంది. ఆమెను వర్చువల్ గానా? భౌతికంగా హాజరు పర చాలో అధికారులు సోమవారం నిర్ణయం తీసుకోనున్నారు. మార్చి 26 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో కవిత ఉన్న విషయం తెలిసిందే. ఢిల్లీ మద్యం విధానంలో కవిత పాత్రపై ఇడి ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేసింది.

ఇడి చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై సిబిఐ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనున్నది. కాగా ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో గతంలోజ్యుడీషియల్ కస్టడీ ముగిసినప్పటికీ మే 20 వ తేదీ వరకు పొడిగిస్తూ ఢిల్లీలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం రౌస్ అవెన్యూ కోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కవితకు మరో 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించాలని కోర్టును ఇడి కోరింది. 8 వేల పేజీలతో



సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేశామని ఇడి పేర్కొంది. దీంతో జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. ఇడి దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై మే 20న విచారణ జరుపుతామని రౌస్ అవెన్యూ కోర్టు వెల్లడించింది.


# నేటి నుంచి టెట్

**హైదరాబాద్,(నమస్తే ఉదయం):** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిఎస్ టెట్) 2024 పరీక్షలు సోమవారం నుంచి ప్రా కానున్నాయి. ఈ నెల 20 నుంచి జూన్ 2వ తేదీ వరకు టెట్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. తొలిసారి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి) విధానం లో టెట్ పరీక్ష జరగనున్నది. రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు టెట్ కన్వీనర్ వెల్లడించారు. టెట్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 80 పరీక్షా కేంద్రాలు ఏర్పా టు చేయగా, మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 25 కేంద్రా లు, రంగారెడ్డి జిల్లాలో 17, కరీంనగర్‌లో 8, ఖమ్మంలో 8 కేంద్రాలు ఏర్పాటు చేశారు. హన్మకొండ జిల్లాలో నాలు గు, హైదరాబాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, సూర్యాపేటలో జిల్లాకు రెండు కేంద్రాల చొప్పున ఏర్పాటు చేయగా, అదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, మెదక్, వ రంగల్‌లో జిల్లాకు ఒకటి చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఈ నెల 20 నుండి టెట్ పేపర్ 2, ఈ నెల 30 నుండి టెట్ పేపర్ 1 పరీక్ష నిర్వహించనున్నారు. ఉద యం 9 నుంచి 11.30 వరకు సెషన్ 1, తిరిగి మధ్యా హ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు సెషన్ 2 పరీక్ష ఉంటుంది. టెట్‌కు మొత్తం 2,86,386 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, పేపర్ 1కు 99,958 దరఖాస్తులు, పేపర్ 2కు 1,86,428 వచ్చాయి. పేపర్ 2కు అత్యధికంగా నల్గొండ జిల్లాలో 9,162 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ములుగు జిల్లాలో 1,888 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే పేపర్ 1కు వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 5,879 మంది దరఖాస్తు చేసుకోగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యల్పంగా 771 మంది దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ తెలిపారు. 2016లో టెట్‌కు 3.40 లక్షల దరఖాస్తులు రాగా, 2017లో 3.29 లక్షలు, 2022లో 3.79 లక్షలు, 2023లో 2.83 దరఖాస్తులు వచ్చాయి.

### జూన్ 12న ఫలితాలు

టెట్ ఫలితాలను జూన్ 12వ తేదీన విడుదల చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012 నుంచి, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2015 నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షను విద్యాశాఖ ని ర్వహిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 2.50 లక్షల మంది అభ్యర్థులు టెట్‌కు అర్హత సాధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే డిఎస్‌సిలో టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. దీంతో కొత్తగా బి.ఇడి, డి.ఇడి పాసైన అభ్యర్థులతోపాటు గతంలో టెట్ పాసైన వారు సైతం మార్కులు పెంచుకునేందుకు ఈ పరీక్ష నిర్వహించిన ప్రతిసారీ రాస్తుంటారు.



# పార్లమెంట్ భద్రత
# ఇక సిఐఎస్‌ఎఫ్‌కు

**న్యూఢిల్లీ, (నమస్తే ఉదయం):** సోమవారం నుంచి పార్లమెంట్ భద్రత బాధ్యతలను కేంద్రీయ పారిశ్రామిక భద్రతా బలగాలు (సిఐఎస్ఎఫ్) చేపడుతాయి. దేశ ప్రజాస్వామ్య సౌధం భద్రతను ఇప్పటివరకూ పర్యవేక్షిస్తున్న 1400 మంది జవాన్లతో కూడిన సిఆర్‌పిఎఫ్‌ను ఈ విధుల నుంచి తప్పించారు. ఈ బలగాల స్థానంలో ఇప్పుడు 3300 మందితో కూడిన సిఐఎస్ఎఫ్ దళాలను రంగంలోకి దింపుతున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. నూతన పార్లమెంట్ ఆవరణ భద్రతా పర్యవేక్షణ బాధ్యతల్లో ఉన్న సిఆర్‌పిఎఫ్‌కు చెందిన పార్లమెంట్ డ్యూటీ గ్రూప్ (పిడిజి) శుక్రవారమే ఈ ప్రాంతం నుంచి తమ పర్యవేక్షక బాధ్యతల నుంచి వైదొలిగింది.

ఈ బలగాలకు చెందిన కార్య నిర్వాహక వ్యవస్థ అనుబంధం అయిన వాహనాలు, ఆయు ధాలు, కమెండోలు తమ కార్యకలాపాలను ముగించాయి. ఈ బలగాల సారధ్య బాధ్యతల్లో ఉన్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ర్యాంక్ అధికారి ఒకరు శుక్రవారం పార్లమెంట్ ఆవరణలోని సెక్యూరిటీ పాయింట్స్‌ను లాంఛనంగా సిఐఎస్ఎఫ్ బృందానికి అప్పగించారని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఇకపై మొత్తం మీద 3317 మంది సిఐఎస్ఎఫ్ సిబ్బంది డ్యూటీలు తీసుకుంటారు. వీరు పాత, కొత్త పార్లమెంట్, అనుబంధ భవనాల భద్రతను పర్యవేక్షించాల్సి ఉంటుంది. సెంట్రల్ ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ఆవరణలో గత ఏడాది డిసెంబర్ 13వ తేదీన జరిగిన భద్రతా ఉల్లంఘన ఘటనల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఈ విషయంపై సీరియస్ అయింది. ఈ క్రమంలో సిఆర్‌పిఎఫ్ నుంచి ఈ బాధ్యతలను తప్పించి సిఐఎస్ఎఫ్‌కు అప్పగించాలనే నిర్ణయం తీసుకుంది.

# జూనియర్ మోడల్ విజేతగా చిహ్నిక

- గాజువాక బాలిక ఘనత
- అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

**అమరావతి,(నమస్తే ఉదయం):** తెలుగమ్మాయి చిహ్నిక జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ విజేతగా నిలిచింది. కేరళలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తరపున పోటీలో పాల్గొన్న గాజువాకకు చెందిన చిహ్నిక ఈ ఘనత సాధించింది. ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా నిలిచింది. త్వరలో జరగనున్న అంతర్జా తీయ స్థాయి పోటీలకు ఎంపికైం ది. చిహ్నిక గతంలోనూ అనేక పోటీల్లో బహుమతుల కైవసం చేసుకుంది.

# సింగపూర్‌లో భారీగా కరోనా కేసులు

**సింగపూర్, (నమస్తే ఉదయం):** సింగపూర్‌లో కరోనా మళ్లీ విజృంభిస్తోంది. ఈ నెల 5వ తేదీ నుంచి 11 వరకు 25,900 కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రజలంతా మాస్కులు ధరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం వేవ్ ప్రారంభ దశలో ఉందని.. రానున్న 2-4 వారాల్లో భారీగా కేసులు నమోదవుతాయని అంచనా వేస్తోంది. రోజుకు 250 మంది ఆస్పత్రుల్లో చేరుతుండగా.. 60 ఏళ్లు పైబడిన వారు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారు అదనపు డోస్ టీకా తీసుకోవాలని ప్రభుత్వం సూచిం చింది.




### కొత్తకోట ఆమీనుల్ మిస్కీన్ ట్రస్ట్ అధ్వర్యంలో
# ఉచిత ఖాత్న (సున్తీ) క్యాంప్

**కొత్త కోట,మే19 (నమస్తే ఉదయం):** కొత్తకోట ఆమీనుల్ మిస్కీన్ ట్రస్ట్ అధ్వర్యంలో ఉచిత ఖాత్న (సున్తీ) క్యాంప్ ఆదివారం క్యూ ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. సంస్థ ప్రతినిధులు డాక్టర్ తౌఫిక్ ఇమామ్ , డాక్టర్ మహమ్మద్ ముజీబ్ , సిబ్బంది పాల్గొన్నారు. నిరుపేద కుటుంబాలకు ఎంతో సహకరిస్తూ ఒక సున్తి చేయడానికి 5వేల రూపాయలు అవుతుందన్నారు. ఈ ఖర్చును అమీనుల్ మెస్కిన్ ట్రస్ట్ భరిస్తూ కులమతాలకు అతీతంగా 120 మంది పిల్లలకు 6 లక్షల సున్తీ ఖర్చు చేసిందన్నారు. అమీనుల్ మెస్కిన్ ట్రస్ట్ అధ్యక్షులు ఎం ఏ హాఫీజ్ మాట్లాడుతూ... ట్రస్ట్ గత 20 సంవత్సరాల నుండి నిరుపేద లకు ఎద్యుకేషన్ హెల్త్ మెడికల్ , వివాహాలకు సేవలు అందిస్తుందన్నారు. ట్రస్ట్ గత 20 సంవత్సరాల నుండి నిరుపేద లకు ఎద్యుకేషన్ హెల్త్ మెడికల్ , వివాహాలకు సేవలు చేస్తూ వస్తుందిఅని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు మాజీ అమీనుల్, మేస్కిన్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్లాతీఫ్ ,అబ్దుల్ గఫార్ ,ఫయాజ్ అలీ, జావీద్ అలీ ఎంతో కృషి చేస్తారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మౌలానా ఖాజి షఫీ ,ఆఫీస్ కమల్ రెహమాన్,ఖాద్రియ మస్జిద్ మౌలానా సలాం గారు ,మక్కా మసీద్ మౌలానా షబ్బీర్, అహ్మద్, రషీ ద్ , మదీనా మజీద్ మౌలానా , గౌరవ అధ్యక్షులు మాజీ అమీనుల్ మేస్కిన్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్లాతీఫ్ ,అబ్దుల్ గఫార్ ,ఫయాజ్ అలీ, జావీద్ అలీ ఎంతో కృషి చేస్తారని చెప్పారు.

### తమిళనాడులో వర్షాలు..
# రెడ్ అలర్ట్ జారీ

**తమిళనాడు, (నమస్తే ఉదయం):** తమిళనాడులో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేప ధ్యంలో ఆదివారం నుంచి మంగళవారం మధ్య ఆ రాష్ట్రానికి వాతా వరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. కన్యాకుమారి, టెన్ కాశీ, కోయం బత్తూరు, తంజావూర్, తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. సేలం, ధర్మపురి, తిరుపూర్, నీలగిరి



జిల్లాల్లో ఇవాళ, రేపు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

# ఎయిర్ ఇండియా విమానం ఇంజన్‌లో మంటలు

**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** బెంగళూరు నుంచి కొచ్చి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఇంజిన్‌లో మంటలు వ్యాపించాయి. దాంతో బెంగళూరు కెంపెగౌడ విమానాశ్ర యంలో అత్యవసర ల్యాండిరగ్ చేసి మంటలను ఆర్పివేశారు. మొత్తం 179 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందిని సురక్షితంగా తరలించారు.

జనరల్ న్యూస్ GENERAL NEWS
సోమవారం ● 20, మే 2024
నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక




ధరూర్ మండల జెడ్ పి హెచ్ ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## పిల్లలను భవిష్యత్ తరాలుగా తీర్చిదిద్దాలి

### మల్దకల్ మండల విద్యాధికారి సురేష్

**ధరూర్,మే19(నమస్తే ఉదయం):**
ధరూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు ఆదివారం 2022 -2023 బ్యాచ్ ఆ స్కూల్లో చదివిన పూర్వవిద్యార్థులు సమావేశం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఒకరికి ఒకరు సంతోషం పంచుకొని వాళ్ల కోరికల మేరకు అభిప్రాయాల మేరకు, వివిధ వృత్తిలో స్థిరపడి మంచి ఆయుష్షు ఆరోగ్యాలతో స్థిరపడినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇంకా ముందు ముందు భవిష్యత్తులో పై స్థాయికి ఎదిగి పేరు ప్రతిష్టలు సంపాదించాలని గురువులు అన్నారు. మల్దకల్ మండల విద్యాధికారి జి.సురేష్ , మిగతా ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో పలుచోట్ల వర్షం..

**రాజేంద్రనగర్, మే 19(నమస్తే ఉదయం):**
నగర శివారు రాజేంద్రనగర్ నియోజవర్గంలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదర్ గూడ,అత్తాపూర్, రాజేంద్రనగర్,డైరీఫార్మ్ చౌరస్తా,అరాంఘర్,మైలార్ దేవులపల్లి,శంషాబాద్



తో పాటు పలుచోట్ల జల్లులతో పాటు తేలికపాటి వర్షం కురిసింది.ఇదిలా ఉండగా..పొద్దంతా ఎండ దంచికొట్టగా..సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. నగర శివారని నల్లటి మేఘాలు కమ్మేయడంతో ఒక్కసారిగా చల్లబడింది. పలుచోట్ల ఈదురుగాలులు వీచాయి.

## తెలంగాణ దళిత దండు రాష్ట్ర కార్యదర్శిగా గుర్రంపల్లి ఉదయ్ కుమార్

**రాజేంద్రనగర్,మే19(నమస్తే ఉదయం):** తెలంగాణ దళిత దండు రాష్ట్ర కార్యదర్శిగా రాజేంద్ర నగర్ బస్తీకి చెందిన గుర్రంపల్లి ఉదయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.ఈ మేరకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బచ్చలకూర బాలరాజు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు.ఈ



పార్టీ కండువా కప్పుతున్న తెలంగాణ దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చల కూర బాలరాజు

సందర్భంగా గుర్రంపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ...దళితుల హక్కుల సాధన కొరకు పోరాడుతామన్నారు.దళితులకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.భారత రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని,దళితుల హక్కులు-సామాజిక న్యాయం కోసం అందరం కలిసి కలసికట్టుగా పోరాడుదామని ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు.75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో నేటికీ దళితులపై దాడులు,అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సబ్ ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందని,రిజర్వేషన్లను అమలు చేయకుండా చూస్తోందన్నారు.లౌకిక రాజ్యాంగానికే ప్రమాదం పొంచి ఉందని, మన హక్కులను కాలరాస్తోందన్నారు.

## జియాగూడలోని భారత అభ్యుదయ హై స్కూల్ 1995- 96 విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**మెహదీపట్నం, మే19(నమస్తే ఉదయం):**
జియాగూడ లోని భారత అభ్యుదయ హై స్కూల్ 1995- 96 బ్యాచ్ కు చెందిన ఎస్ఎస్సి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడపడమే కాకుండా చారిటీ కార్యక్రమాలను




ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. 28 సంవత్సరాల తర్వాత కూడ ఎంతో ఉత్సాహంగా మేము ఇప్పటికే విద్యార్థులం అంటూ ఆత్మీయ పలకరింపులతో పులకించిపోయారు, పాఠశాల లోగోతో ప్రత్యేక మెమెంటోను అందించుకుంటూ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని మనోజ్, రామస్వామి, ప్రభాకర్, గజానంద్, ఆనంద్ తోపాటు సునీత మరికొందరు ముందుకు నడిపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు.

# ఆదర్శ నేత సుందరయ్య: వెంకటస్వామి

### దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతకు ఘనమైన నివాళులు

### నిరాడంబరతకు నిలువెత్తు సాక్ష్యం సుందరయ్య : సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి.

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 19(నమస్తే ఉదయం):**
దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత నిరాడంబరతకు నిలువెత్తు సాక్ష్యమైన ఆదర్శ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి అన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం ధరూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ... నేటి తరం రాజకీయ నాయకులు సుందరయ్య జీవితాన్ని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని రాజకీయ రంగంలో ఆదర్శవంతమైన నేతగా సుందరయ్య నిలిచారని ప్రజాప్రతినిధిగా సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లి తన నిరాడంబరతను చాటుకున్నారని తెలిపారు.

1913 సంవత్సరం మే 1న నెల్లూరు జిల్లా అలగానిపాడు లో జన్మించిన సుందరయ్య చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమాల వైపు ఆకర్షితుడై పేదల కోసం అలుపెరగని పోరాటం చేశాడని ధనిక కుటుంబంలో పుట్టి పెరిగినా జీవితాంతం కమ్యూనిస్టు ఆచరణతో ఉండటం ఆయన సొంతమని, ఆశయంపై అచంచల విశ్వాసంతో ఉంటూ ఎన్ని కష్టాలు వచ్చినా ఆ పరీక్షలకు తట్టుకొని పేద ప్రజల కోసం నిలబడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.



పుచ్చలపల్లి సుందరయ్య కొన్ని వాళ్ళ అర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

దేశంలో విప్లవ సాధనకు మార్గాన్ని వ్యూహాన్ని నిర్దేశించిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి పోరాడిన యోధుడు సుందరయ్య అని అన్నారు.

కుల మతాలతో రాజకీయం చేస్తున్న నేటి సమాజంలో ప్రజాసేవకు కులం అడ్డు రాకూడదు అనే ఉద్దేశంతో సుందర రామిరెడ్డి అనే పేరును సుందరయ్యగా మార్చుకుని పేద ప్రజలతో మమేకమై పోరాటాలు నడిపిన పేదల బంధువు అని అన్నారు.

రైతాంగ ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలు, వ్యవసాయ కూలీల కు గిట్టుబాటు కూలి కోసం అనేక ఉద్యమాలు నడిపిన పోరాట యోధుడు అని తెలిపారు.

1985 మే 19వ తేదీన పుచ్చలపల్లి సుందరయ్య మరణించాడని భౌతికంగా ఆయన లేకపోయినా ఆయన చూపిన మార్గంలో నేటి తరం కమ్యూనిస్టులు సుందరయ్య ఆశయాల సాధన కోసం పేద ప్రజల విముక్తి కోసం పోరాటాలు చేయాలని సుందరయ్యను ఆదర్శంగా తీసుకొని ఉద్యమాలు నడపాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ధరూర్ మండల నాయకులు నరసింహులు, గోవిందు, చిన్న గోవిందు, దేవదాసు, తిమ్మప్ప, ఆంజనేయులు, మోష, దుబ్బన్న, రంగస్వామి, మునిసిపల్ యూనియన్ జిల్లా నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు పోరాటం ఆగదు

### - ఐజ అఖిల కమిటీ ఏకగ్రీవ తీర్మానం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 19(నమస్తే ఉదయం):**
గద్వాల జిల్లా ఐజ పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం గత నెల రోజులుగా ఐజ పెద్ద వాగు పై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడానికి మరోసారి అఖిల పక్ష కమిటి సమావేశమైంది.

ఈ సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు మాట్లాడుతూ అఖిలపక్ష కమిటీ ఆందోళన చేపట్టిన తర్వాత కరెంట్ పోల్స్ పాతడం జరిగిందని, అప్రోచ్ రోడ్డు పనులు చేయడానికి పూనుకున్నా వేగవంతంగా పూర్తి చేయకపోతే వానాకాలంలో వచ్చే సమస్యలపై సమావేశం జరిగింది .

అధికారులపై, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకొస్తేనే పనులు జరుగుతున్నాయని, ఒత్తిడి తగ్గించరాదని, కమిటి అభిప్రాయ పడింది. అధికారులు, స్పందించకపోవడం వల్లే అఖిలపక్ష కమిటీ ఏర్పాటు అయిందని, ఈ అఖిలపక్ష కమిటీ ద్వారానే




ప్రజల సమస్యలను పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని, పార్టీలకతీతంగా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అయిజ బ్రిడ్జితో పాటు, అయిజలో డిగ్రీ కళాశాల, రెవిన్యూ డివిజన్ కోసం కృషి చేయాలని కమిటి అభిప్రాయ పడింది. ముఖ్యంగా పులికల్ రోడ్డు కొరకు కూడా పోరాడాలని అఖిల పక్ష కమిటి తీర్మానించింది.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి..


**రాజేంద్రనగర్,మే19(నమస్తే ఉదయం):**

బైక్ పై వెళ్తున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... అరంఘర్ నుంచి మెహిందీపట్నం వైపు వెళుతుండగా అత్తాపూర్ పిల్లర్ నంబర్ 150 వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది.బైక్ పై వెళు తున్న బీహార్‌కు చెందిన ఓ వ్యక్తిని లారీ బలంగా ఢీకొట్టింది.దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ విషయం తోటి ప్రయాణికులు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు హుటా హుటిన సంఘటన స్థలం చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం పరచుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.

ఈ మేరకు కేసు నమోదు చేసుకొని రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

# 'కల్కి 2898 ఎడి' భైరవకు నమ్మకమైన స్నేహితుడు 'బుజ్జి'

మాగ్నమ్ ఓపస్ 'కల్కి 2898 ఎడి' చుట్టూవున్న ఎక్సయిట్మెంట్ ప్రపంచవ్యాప్తంగా సినీ ఔత్సాహికులలో నెక్స్ట్ లెవల్ కు చేరుకుంది. మే 22, 2024న ఐదవ సూపర్‌స్టార్, భైరవ ప్రాణ స్నేహితుడైన బుజ్జి ని రివల్ చేయనున్నారనే ఎనౌన్స్మెంట్ తో ఎక్సయిట్మెంట్ అవధులు లేని ఆనందాన్ని తాకింది.

'ఫ్రమ్ స్క్రాచ్ ఇపి4: బిల్డింగ్ ఎ సూపర్‌స్టార్' అనే పేరుతో బిహైండ్ ది స్క్రీన్ గ్లింప్స్ తో, జూన్ 2020లో దర్శకుడు నాగ్ అశ్విన్ గొప్ప విజన్ తో ప్రారంభించినప్పటి నుంచి "సూపర్‌హీరో", "భైరవ'గా ప్రజెంట్ చేసిన వీడియోతో క్రియేటర్‌లు ప్రేక్షులుని అద్భుతమైన ప్రయాణంలో తీసుకెళ్తారు.

'బెస్ట్ ఫ్రెండ్," "బెస్ట్ కంపానియన్" బుజ్జి నెటిజన్లను గెస్సింగ్ లో వుంచడంతో పాటు 5వ సూపర్‌స్టార్ గురించి మరింత తెలుసుకోవడానికి ఆసక్తిని కలిగిస్తుంది. 2 నిమిషాల 22 సెకన్ల వీడియో గ్యారేజ్ సెట్టింగ్‌లో ప్రభాస్‌తో ఒక మిస్టీరియస్ ఎన్‌కౌంటర్‌తో సహా టీసింగ్ గ్లింప్స్ ని అందిస్తూ, మే 22న బుజ్జి గ్రాండ్ డెబ్యు కోసం ఆసక్తిని పెంచుతుంది. ఇటీవల కల్కి 2898 ఎడి నుంచి విడుదలైన అమితాబ్ బచ్చన్ అశ్వత్థామ పాత్ర ప్రేక్షకులని మంత్రుముగ్ధులని చేసింది.

తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, ఇంగ్లీషు భాషలలో రివిల్ టీజర్, ట్రూ పాన్-ఇండియన్ టీజర్‌గా సెలబ్రేట్ చేసుకుంది.



## అక్కడ ముగిసింది..
# ఇక్కడ మొదలైంది

నిన్న మొన్నటివరకూ మెగా ఫ్యామిలీ హీరోలంతా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సంగతి తెలిసిందే. రామ్ చరణ్..వరుణ్ తేజ్..సాయితేజ్..వైష్ణవ్ తేజ్ ఇలా అంతా జనసేనకు మద్దతుగా ప్రచారం చేసారు. మెగాస్టార్ చిరంజీవి నేరుగా పిఠాపురం వచ్చి ప్రచారం చేయలేదు గానీ తమ్ముడికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అలాగే కూటమి తరుపున పోటీ చేస్తోన్న వారందర్నీ గెలిపించాలని సోషల్ మీడియా వేదికగా వీడియోలు కూడా రిలీజ్ చేసారు. వీళ్లందరికీ కాంట్రాస్ట్ గా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మాత్రం నంద్యాల వైకాపా ఎమ్మెల్యే అభ్యర్ధికి మద్దతు ప్రకటించారు. తన స్నేహితులు కావడంతోనే పార్టీలతో సంబంధం లేకుండా తన సహకారాన్ని అందించారు.

ఇలా చేయడంతో మెగా–అల్లు అభిమానుల మధ్య ఎలాంటి వైరం తలెత్తిందో తెలిసిందే. అభిమానుల మధ్య సోషల్ మీడియాలో పెద్ద యుద్ధమే జరిగింది. అయితే ఇదంగా ముగిసిన గతం. తాజాగా ఈ హీరోలంతా మళ్లీ మ్యాకప్ లు వేసుకుని షూటింగ్ లకు బయల్దేరారు. చరణ్ గేమ్ ఛేంజర్ షూటింగ్ లో పాల్గొంటున్నాడు. ఆర్సీ 16 కూడా వచ్చే నెల నుంచి పట్టాలెక్కించనున్న నేపథ్యంలో గేమ్ ఛేంజర్ తన పోర్షన్ జూన్ కల్లా పూర్తి చేయాలని ముందుకు కదిలాడు. చిరంజీవి కూడా ఎన్నికలు సహా ఎండలు ఎక్కువగా ఉండటంతో ఇన్ని రోజులు బ్రేక్ తీసుకున్నారు. ఆయన కూడా విశ్వంభర షూట్ లో బిజీ అయ్యారు. సాయితేజ్..వైష్ణవ్ తేజ్ ఇద్దరు కొత్త ప్రాజెక్ట్ పనుల్లో బిజీ అయ్యారు. వరుణ్ తేజ్ 'మట్కా' షూటింగ్ ని తిరిగి ప్రారంభించాడు. ఇక అల్లు అర్జున్ కూడా 'పుష్ప–2' షూట్లో బిజీ అయ్యాడు. ఈ సినిమా షూట్ కూడా డిలే అవ్వడంతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పరుగు మొదలు పెట్టాడు.

ఇలా మెగా హీరోలంతా మళ్లీ బ్యాక్ టూ పెవిలియన్ అనిపించారు. పొలిటికల్ వార్ కి ముగింపు పలికి షూటింగ్ అనే కొత్త వార్ లోకి దిగారు. రాజకీయాల్లో విమర్శలు–ప్రతివిమర్శలు సహజం. వాటిని సీరియస్‌గా తీసుకునే అవకాశం లేదు. ఎందుకంటే సినిమా వేరు..రాజకీయం వేరు అని ఇండస్ట్రీకి చెందిన ప్రతీ ఒక్కరూ భావిస్తారు. అదే పాజిటివ్ ఎనర్జీతో అంతా ముందుకెళ్తున్నారు.



## 'యేవమ్'లో 'వశిష్ట ఎన్ సింహ'గా యుగంధర్

రీసెంట్ గా మహిళలను ఉద్దేశించి 'ఆడపిల్లనే అయితే ఎంటటా' అనే హుక్ లైన్ తో చాందినీ చౌదరి క్యారక్టర్ పోస్టర్ ను, అలాగే హాట్ లుక్ లో 'నా బాడీ సూపర్ డీలక్స్' అంటూ ఆషు రెడ్డి పోస్టర్ ను అలానే అలాగే పోలీస్ ఆఫీసర్‌గా ఆక్టర్ భరత్‌తో "ఇన్ ఏ క్రైమ్ దేర్ ఆర్‌నో కోఇన్సిడెన్సేస్' అని పోస్టర్ రిలీజ్ చేశారు, ఆ పోస్టర్స్ అన్నింటికీ విశేష స్పందన లభించింది, ఇప్పుడు అదే తరహాలో మరో వైదిధ్యమైన కారక్టర్ పోస్టర్ ను రిలీజ్ చేసారు, కన్నడ రాయల్ స్టార్ వసిష్ఠ ఎన్ సింహ ను 'యుగంధర్' లుక్ లో పంచ కట్టులో చేతిలో డమరుకం పట్టుకుని "ఏం? నేను సరిపోనా? అనే హుక్ లైన్ తో మరో పోస్టర్ లాంచ్ చేశారు.

యుగంధర్ తెలుగులో ఇప్పటి వరుకు చేసిన అన్ని క్యారెక్టర్ లతో పోలిస్తే ఈ లుక్ చాలా యునీక్ గా ఉంది అని ప్రేక్షకుల నుండి కామెంట్స్ వస్తున్నాయి.



## స్కూల్ వయసులోనే చాలా ట్రోల్స్ ఎదుర్కొన్నా...

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు అవ్వడంతో జాన్వీ కపూర్ హీరోయిన్ అవ్వక ముందు నుంచే సెలబ్రిటీ అనే విషయం తెల్సిందే. జాన్వీ కపూర్ స్కూల్ లో చదువుతూ ఉన్నప్పటి నుంచే చాలా మంది శ్రీదేవి మరియు బోనీ కపూర్ లను మీ పాపను హీరోయిన్ గా చేస్తారా అంటూ అడిగేవారట. మీడియాలో జాన్వీ కపూర్ మరియు ఖుషి కపూర్ ల ఫోటోలు రెగ్యులర్ గా వస్తూ శ్రీదేవి కిడ్స్ అంటూ కథనాలు వచ్చేవి. సాధారణంగా సెలబ్రిటీలు ఎదుర్కొనే ఎన్నో ఇబ్బందులను జాన్వీ కపూర్ హీరోయిన్ అవ్వక ముందే ఎదుర్కొందట. తన బాడీ షేమింగ్ మొదలుకుని ఎన్నో విషయాల గురించి స్కూల్ ఏజ్ లోనే ట్రోల్స్ ఎదుర్కొన్నాను అంటూ జాన్వీ కపూర్ తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. హిందీలో ఈమె నటించిన మహీ సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా చిన్నతనంలో తాను ఎదుర్కొన్న ట్రోల్స్ గురించి చెప్పుకొచ్చింది. ముఖ్యంగా తాను స్కూల్ లో ఉన్న సమయంలోనే కొందరు నా ఫోటోను మార్ఫింగ్ చేసి పో ర్న్ సైట్ లో పెట్టారట. దాంతో నా స్నేహితులు గేలి చేసేవారు. అప్పుడే ట్రోల్స్ ను ఎదుర్కోవడం మొదలు పెట్టాను. నన్ను ఏదో విషయం చూపించి విమర్శించే వారి గురించి ఎక్కువ ఆలోచించి నా పనిని నేను వదిలేయను. వారి విమర్శలు పట్టించుకోకుండా నేను ఏం చేయాలో అదే చేసుకుంటూ ముందుకు సాగుతున్నాను అంది. జాన్వీ కపూర్ ఇప్పటికి కూడా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఏదో ఒక విషయంలో ట్రోల్స్ ను ఎదుర్కొంటూనే ఉంటుంది. అయితే వాటిని తాను పట్టించుకోను అంది. కానీ తన కుటుంబ సభ్యుల గురించి ఎవరైనా, ఏమైనా ట్రోల్ చేస్తే మాత్రం తట్టుకోవడం నా వల్ల కాదు అన్నట్లుగా చెప్పుకొచ్చింది.





## కేన్స్‌లో కియారా

రోమ్ వెళితో రోమన్‌లా ఉండాలని అంటారు.. కానీ కేన్స్ కి వెళ్లిన కియరాకు ఏమైందో తెలిస్తే షాక్ అవుతారు! వివరాల్లోకి వెళితే.. అందాల కథానాయిక కియారా అద్వానీ 2024 కేన్స్‌లో అరంగేట్రం చేసింది. ఈవెంట్లో కియరా హంగామా ఆషామాషీగా లేదు. ఈ బ్యూటీ సందడికి సంబంధించిన ఒక స్పెషల్ వీడియో తాజాగా వైరల్‌గా మారింది. అయితే నెటిజనులు వెంటనే ఒక విషయాన్ని గ్రహించారు. కియరా తన భాష యాసను అనూహ్యంగా మార్చేసిందని కనిపెట్టేయడమే గాక.. తనపై తీవ్రంగా విమర్శలు ఎక్కుపెట్టారు. కియరా ఇప్పుడే ఇలా ఎందుకు చేసింది? అంటూ చాలా మంది ప్రశ్నించారు. కియారా ఫ్రెంచ్ రివేరాలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. క్రేప్ ఐవరీ గౌనులో ఈ బ్యూటీ ఫస్ట్ లుక్ .. అందమైన నారింజ రంగు దుస్తులలో రెండవ లుక్ ఇప్పటికే వైరల్ అయ్యాయి. కియారా అద్వానీ మూడవ ప్రదర్శనగా .. సినీరంగానికి చెందిన మహిళలను గౌరవించడం కోసం రెడ్ సీ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌కు హాజరయ్యింది. ఈ పార్టీలో కియారా అద్వాణీ లేస్ గ్లోవ్స్‌తో పింక్ అండ్ బ్లాక్ గౌనులో అద్భుతంగా కనిపించింది. ఈ కార్యక్రమానికి హాజరవడం ఎంత గౌరవంగా భావిస్తోందో తెలిపిన వీడియో వైరల్‌గా మారింది. అయితే అభిమానులు కియరా భాష యాసను డీప్ గా పరిశీలించి విమర్శలు ఎక్కుపెట్టారు. కియరా మారిన యాసపై అభిమానులు చాలా ఆశ్చర్యపోయారు. చాలామంది దీనిని – ఫేక్ – అని అభివర్ణిస్తున్నారు. కియరా ఏంటి ఇలా మాట్లాడుతోంది.. కేన్స్ కి వెళ్లాకే ఇలా అయిందేమిటీ? అన్న కామెంట్లు వినిపించాయి. మొత్తానికి కియరా క్లిప్ అంతర్జాలంలో వైరల్ గా మారింది కియారా అద్వాణీ తదుపరి వరుస చిత్రాలతో అభిమానులను అలరించనుంది.



**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.